# మారిపోయిన మొగిలి

శ్రీమతి. వాశిరెడ్డి సీతాదేవి...

"ఆ కూత మళ్ళీ కూశావంటే పళ్ళు రాల్తయ్! ఆఁ ఏమనుకుంటున్నావో? మరీ ఒళ్ళు తెలియక చస్తున్నావ్!"

"ఒళ్ళు తెలియక చస్తుందెవరో తెలుస్తూనే వుంది."

"మూయ్ నోరు! మాటకు మాట ఎదురు చెప్తావా?" శేషయ్య చేతిలోవున్న వంకె కర్ర పెళ్ళాం మీదకు నిలువుగా లేచి నుంచుంది.

"ఊఁ కొట్టండి! కూడు పెట్టటం చేతకాకపోయినా కొట్టటం మాత్రం తెలిసిందిలే! ఊఁ! కొట్టండి చూస్తాను?" రెండు చేతులూ అడ్డం పెట్టుకుంటూ ముందుకు జరుగుతూ అన్నది రామసుబ్బమ్మ.

"ఏమిటి నాన్నా! అదీ!" అంటూ శేషయ్య కూతురు వంటింట్లోనుండి పరుగెత్తుకొచ్చింది.

"ఛీ! ఛీ! మనిషి జన్మ ఎత్తాక కాస్త పరువూ, మర్యాదా వుండాలి!" అంటూ శేషయ్య యెత్తిన కర్రను దూరంగా విసిరేసి, వసారాలోకిపోయి మంచం వాల్చుకు మేను వాల్చాడు.

పాతిక సంవత్సరాలు కాపరం చేసిన రామసుబ్బమ్మ భర్తకు తొలిసారిగా యెదురుతిరిగింది. పతివ్రతా, పరమసాధ్వి అయిన రామసుబ్బమ్మ-భర్త గీచిన గీటును దాటి యెరుగని రామసుబ్బమ్మ, ఈ లోక దైవాన్నే ధిక్కరించింది! సత్యకాలం కాకపోబట్టి సరిపోయింది. కాకపోతే అటు సూర్యుడు యిటు పొడిచీ, నక్షత్రాలు ఝల్లున నేలరాలి, భర్త శాపాగ్నిలో రామసుబ్బమ్మ మలమలా మాడి మసై వుండేది! కాకపోతే చిన్నసైజు నల్లరాతి బండైనా అయి వుండేది.

అదేమీ కాకపోగా రామసుబ్బమ్మ మీద మీదకు "ఏ మాత్రం కొడతావో కొట్టూ?" అన్నట్లు వచ్చింది. దానికి తగ్గట్టు కసుల ఒకతి అమ్మకుతగ్గ కూతురే!

అస్త్రసన్యాసం చేసి వచ్చి పడుకున్న శేషయ్య మెదడు కుతకుత లాడిపోయింది. జరిగిన సంఘటనను గురించిన ఆలోచనల్లో మునిగిపోయాడు.

ఛ! తను పొరపాటు చేశాడు! ఆ వ జాన రెండు తగిల్తే పోయేది! దానికి రాను రానూ మంచీ-చెడూ తెలియకుండా

